క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



బాన్సువాడ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ రాజేష్ గత నెల 30న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి బాన్సువాడ మండల ఉపాధ్యాయులు ఆర్థిక సాయం చేశారు. ఉపాధ్యాయులంతా వాట్సాప్ గ్రూప్‌లో విషయాన్ని పోస్టు చేయడంతో సుమారు 90 మంది ఉపాధ్యాయులు స్పందించి రూ.51,073 సాయం చేశారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అంకంపాలెంకు మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు వెళ్లారు. ఉపాధ్యాయులు చేసిన ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఎంఈవో వెంట ఉపాధ్యాయులు మందప్రవీణ్, దాసరి రవీందర్, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ భానుప్రసాద్ ఉన్నారు.

పది మందిపై కేసులు నమోదు



కామారెడ్డి క్రైం: పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద పట్టణ పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీలను విస్తృతంగా చేపట్టారు. నెంబర్ ప్లేట్ సక్రమంగా లేని వాహనాలకు, నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలకు జరిమానాలు విధించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న పది మందిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి తెలిపారు. రూ.1.22 లక్షల విలువైన పెండింగ్ చలాన్‌ను కట్టించామని తెలిపారు. వాహనదారులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. పట్టణ ట్రాఫిక్ ఎస్సై మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ శివారులో పోలీసులు ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. పెండింగ్ చలాన్లు ఉన్న వారు చలాన్లు చెల్లించాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్ చేయవద్దనిని, హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని పోలీసులు వాహనదారులకు సూచించారు.

సదాశివనగర్‌లో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై ఆదివారం ఎస్సై పుష్పరాజ్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న చలాన్‌లను కట్టుకోవాలని వాహనదారులకు సూచించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఏఎస్సై జగదీశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురుపూజ



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం గురుపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన వక్తగా జిల్లా ప్రచారక్ మీసాల ప్రకాశ్ హాజరై ప్రసంగించారు. సమాజంలో గురువు ప్రాధాన్యతను వివరించారు. ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా పంచ పరివర్తన్ కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ పెద్దలు, సభ్యులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థినుల ఎంపిక



గంగోత్రి | శ్రీజ | కీర్తి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలం నుంచి ముగ్గురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈవో రామస్వామి తెలిపారు. ఎర్రాపహాడ్ ఉన్నత పాఠశాలకు చెందిన గంగోత్రి, బ్రాహ్మణపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన శ్రీజ, కీర్తి నిర్మల్ జిల్లా బాసరలోని ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీటు సాధించారు. ముగ్గురు విద్యార్థినులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రమాదకర గుంతలు.. తీరేనా చింత



ఎల్లారెడ్డిరూరల్: మత్తమాల గ్రామ శివారులో ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. మత్తమాల నుంచి రుద్రారం వెళ్లే దారిలో రోడ్డు పక్కన రెండు పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ప్రమాదం జరిగే అవకాశం ఉందని, అధికార యంత్రాంగ స్పందించి గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

శిథిలావస్థలో పశువైద్యశాల

- ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి
- బిక్కుబిక్కుమంటూ సేవలందిస్తున్న వైద్య సిబ్బంది
- పాత గ్రామ పంచాయతీలో కాలం వెల్లదీస్తున్న వైనం
- పక్కా భవనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న సిబ్బంది
- బీబీపేట మండలంలో పశువైద్య సేవలకు ఆటంకం



శిథిలావస్థలో ఉన్న బీబీపేట పశువైద్యశాల



ఇనుప చువ్వలు తేలిన పైకప్పు

బీబీపేట: మండలంలోని పశువైద్యశాలకు పక్కా భవనం లేకపోవడంతో సిబ్బంది ప్రాణాలు అరచేతిలో పట్టుకొని సేవలు అందిస్తున్నారు. పాత భవనం స్థలంలో నూతన గ్రంథాలయం భవనాన్ని నిర్మాణం చేయడంతో పశువైద్యశాలను పాత గ్రామ పంచాయతీ భవనానికి మూడేళ్ల కిందట తరలించారు. దీంతో అప్పటికే శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో పాత గ్రామ పంచాయతీ భవనం ఉండడంతో సిబ్బంది బయట కూర్చొనే సేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది. మందులు, వైద్య సామగ్రి ఎక్కడ ఉంచాలో తెలియక అవస్థలు పడుతున్నారు. ఈ పశువైద్యశాల శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితి. ఈ ఆస్పత్రి భవనం పైకప్పు పూర్తిగా ఇనుప చువ్వలు తేలి వేలాడుతున్నాయి.

ఇప్పటికీ 50 ఏళ్ల క్రితం భవనంలోనే..

మండల కేంద్రంలో 50 ఏళ్ల క్రితం నిర్మించినట పాత గ్రామ పంచాయతీ భవనంలోనే పశువైద్యశాల కొనసాగుతోంది. పైకప్పు ముట్టుకుంటే ఊడిపోయేటట్లు ఉంది. ఈ పశువైద్యశాలకు 11 గ్రామాల రైతులు సేవల కోసం వచ్చి వెళుతుంటారు. వచ్చిన వారు సైతం ఆ భవనంలోకి వెళ్లాలంటేనే జంకుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితిలో పశువైద్య సేవలు ఇందులో కొనసాగించాల్సి వస్తోంది.

స్థలం కేటాయింపు..

బీబీపేట పశువైద్యశాల సొంత భవనం నిర్మాణం కోసం 8 ఏళ్ల క్రితం పంచాయతీ పాలకులు వారాంతపు సంత వద్ద 500 గజాల స్థలం కేటాయించారు. ఆ స్థలంపై పాలకులు తీర్మానం కూడా చేశారు. ప్రభుత్వం మాత్రం నిర్మాణానికి నిధులు కేటాయించడం లేదు. కామారెడ్డి జిల్లాకు సరిహద్దులో ఉన్న మండలం కాబట్టి ఇటు పక్క ఏ ఒక్క అధికారి వచ్చి చూడడం కానీ, పట్టించుకోవడం కానీ లేదని రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దీనిపైన దృష్టి సారించి నిధులు మంజూరయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకుందని గతంలో కూడా చాలా సార్లు నివేదికలు అందించాం. ఇక్కడ విధులు నిర్వర్తించడమంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ఎప్పుడు ఎటు పక్క నుంచి ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయంగా ఉంటుంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి నూతన భవనం నిర్మించాల్సిన అవసరం ఉంది.

– హేమశ్రీ, ఇన్‌చార్జి పశువైద్యురాలు, బీబీపేట

నిరుపయోగంగా నీటి తొట్టెలు



భూంపల్లిలో నిరుపయోగంగా మారిన నీటి తొట్టె



ధర్మారావ్‌పేట్ శ్మశాన వాటిక వద్ద..



తిర్మన్‌పల్లిలో..

- రూ.లక్షలు వెచ్చించి లక్షణంగా వదిలేశారు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు ధర్మారావ్‌పేట్, తుక్కోజీవాడి, తిమ్మోజీవాడి, ఉత్తునూర్, తిర్మన్‌పల్లి, మర్కల్, కుప్రియాల్, మోడెగాం, భూంపల్లి, లింగంపల్లి, పద్మాజీవాడి తదితర గ్రామాల్లో గతంలో పశువుల దాహార్తి కోసం, మరి కొన్ని గ్రామాల్లో నీరు వృథా పోకుండా ఉండేందుకు నీటి వసతి ఉన్న చోట కుళాయిలను ఏర్పాటు చేశారు. ఒక్కో నీటి తొట్టె నిర్మాణం కోసం రూ.80 వేల నుంచి లక్ష వరకు ఖర్చు పెట్టారు. ప్రారంభంలో నిర్మించిన నీటి తొట్టెలకు నీటి వసతి కల్పించారు. ఆ తర్వాత వాటి గురించి పట్టించుకునే నాథుడు లేకుండా పోయారు. నీటి తొట్టెల వద్దకు పైప్ లైన్ లేక కొన్ని, పైప్ లైన్ వసతి ఉండి కొన్ని నీటి తొట్టెలు నిరుపయోగంగా మారాయి. మండల స్థాయి అధికారులు దృష్టి సారించి నీటి తొట్టెలను వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

దవాఖానాకు దారేది..?



దారిలేని తిర్మలాపూర్‌లోని పల్లెదవాఖానా

బాన్సువాడ రూరల్: తిర్మలాపూర్‌లో పల్లె దవాఖానాకు దారి లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడ్తున్నారు. దవాఖానాకు వెళ్లాలంటే ప్రయివేట్ వ్యక్తి ఇంటి సమీపం నుంచి వెళ్లాలి. లేదంటే కచ్చా డ్రైన్ దాటి పోవాలి. దవాఖానాకు నిత్యం మహిళలు, చిన్నారులు, వయోవృద్ధులు వస్తుంటారు. అత్యవసర సమయంలో దవాఖానా గేట్ వరకు అంబులెన్స్ కూడా పోలేని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి రోడ్డు గుండా నేరుగా కల్వర్టు నిర్మించి దారి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కేజ్ వీల్స్‌తో బీటీ రోడ్డు ఛిద్రం



బుడిమి బీటీ రోడ్డుపై వెళ్తున్న ట్రాక్టర్

బాన్సువాడ రూరల్: ప్రస్తుతం వానాకాలం వరినాట్ల సీజన్ కావడంతో గ్రామాల్లో బీటీ, సీసీ రోడ్లపై నుంచి కేజ్ వీల్స్‌తో కూడిన ట్రాక్టర్లను యథేచ్ఛగా నడుపుతున్నారు. దీంతో రూ.లక్షలాది ప్రజాధనంతో నిర్మించిన రోడ్లు మూణ్నాళ్లకే ఛిద్రమవుతున్నాయి. ట్రాక్టర్లు ఆగ్రామంలో ఉన్న పలుకుబడి కల్గిన వ్యక్తులు, పెద్ద రైతులవే కావడంతో గ్రామస్తులు వారించలేకపోతున్నారు. కేజ్‌వీల్స్‌కు పట్టీలు తొడిగించి తీసుకెళ్లాలని, ట్రాక్టర్లను శివార్లలోనే నిలిపి ఉంచాలని కోరినా పట్టించుకోవడం లేదు. అధికారులు గ్రామాల్లో పర్యటించి రోడ్డు ధ్వంసం కాకుండా ట్రాక్టర్ ఓనర్లు, గ్రామపెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. లేదంటే భారీ జరిమానాలు విధించి రోడ్లను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్



బాన్సువాడ రూరల్: కొత్తాబాది గ్రామ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రోడ్డుకు ఆనుకుని ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. నిత్యం విరామ సమయంలో విద్యార్థులు ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాల్లో ఆడుకుంటారు. దీంతో ఏ సమయంలోనైనా అటు విద్యార్థులకు గానీ, ఇటువైపు నుంచి వెళ్లే జంతువులకు గానీ పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా మొహర్రం పండుగ



బీబీపేటలో పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు

సాక్షి నెట్‌వర్క్:జిల్లాలో ఆదివారం మొహర్రం పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పీర్లను ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. పీర్లకు ఊదు బెల్లం, కట్నకానుకలను సమర్పించారు. అసోయ్‌దులా ఆడారు. మొక్కులు చెల్లించుకుని సాయంత్రం స్థానిక చెరువులలో పీర్లను నిమజ్జనం చేశారు.



ఎల్లారెడ్డిలో పీర్ల వద్ద ప్రార్థనలు



లింగంపేటలో..



పెద్దకొడప్‌గల్‌లో..



పెద్దమల్లారెడ్డిలో అసోయ్ దులా ఆడుతున్న మహిళలు

శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు



నివాళులర్పిస్తున్న విద్యార్థులు

నస్రుల్లాబాద్: నాచుపల్లి సాంఘిక సంక్షేమ బాలికల మినీ గురుకులంలో ఆదివారం మేరా యువ భారత్, సేవా సంఘ్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా యూత్ వలంటీర్ సునీల్ రాథోడ్ మాట్లాడుతూ.. మహనీయులను గుర్తు చేసుకోవడం మన బాధ్యతని అన్నారు. ఉపాధ్యాయులు కళ్యాణి, సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

రామేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే దంపతుల పూజలు



ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న రామేశ్వర ఆలయ కమిటీ సభ్యులు



బిచ్కుందలో కేక్ కట్ చేస్తున్న నేతలు



పెద్దకొడప్‌గల్‌లో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

పిట్లం(జుక్కల్): చిన్నకొడప్గల్ జీపీ పరిధిలోని రామేశ్వర ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.తొలి ఏకాదశితో పాటు నా జన్మదినం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి శివుడికి అభిషేకం చేసినట్లు ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు తెలిపారు. ఎమ్మెల్యే దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.అనంతరం మండల కేంద్రంలో ఎమ్మెల్యే జన్మదిన సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం సాయిగార్డెన్‌లో జన్మదిన వేడుకలు నిర్వహించారు.ఎమ్మెల్యే సతీమణి అర్చన, నేతలు భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. జుక్కల్ ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.మండల మహిళ అధ్యక్షులు ఇందిర బాయి, నాయకులు అక్కలి సాయిరెడ్డి, సంజీవ్, శ్రీనివాస్, గంగాగౌడ్, ఫిరోజ్ పాల్గొన్నారు.

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు జన్మదిన వేడుకలను నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. మల్లికార్జునప్ప షెట్కార్, పుల్కల్ సొసైటీ చైర్మన్ భీంపటేల్, మాజీ ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్ కేక్ కట్‌చేసి కార్యకర్తలకు తినిపించారు. నాయకులు పుల్కల్ వెంకట్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, తుకారాం, అశోక్, గంగాధర్, గోపాల్‌రెడ్డి, రవి పటేల్ పాల్గొన్నారు.



మహమ్మద్ నగర్ లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే జన్మదిన సంబరాలు

వైభవంగా తొలి ఏకాదశి



జిల్లా కేంద్రంలో వైద్యనాథేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సాక్షి నెట్‌వర్క్:తెలుగు వారి తొలి పండుగ తొలి ఏకాదశిని ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. పండుగ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



బైరాపూర్ రుక్మిణీ విఠలేశ్వర మందిరంలో బారులు తీరిన భక్తులు



సదాశివనగర్: విఠలేశ్వర స్వామి ఆలయంలో భజన కీర్తనలు ఆలపిస్తున్న భజన బృందం



మద్నూర్ విఠలేశ్వర మందిరంలో..



ఎల్లారెడ్డిలో మటన్ కొనేందుకు వచ్చిన జనాలు



తాడ్వాయిలోని మటన్‌షాపు వద్ద..

కిక్కిరిసిన మటన్ మార్కెట్

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకుని మటన్, చికెన్ మార్కెట్లు కిటకిటలాడాయి. ఆలయాలలో ఉన్న భక్తులు ఉన్నట్లు మార్కెట్‌లో ఉన్నారు. సందట్లో సడేమియాలా ధరలు పెంచేశారు.

సమాచారం..

10న తండాల్లో భోగ్ బండార్

బాన్సువాడ: ఈ నెల 10న గురుపౌర్ణమి పురస్కరించుకుని ప్రతి గిరిజన తండాలో భోగ్ బండార్ నిర్వహించాలని ఆలిండియా బంజార సంఘం జాతీయ ఉపాధ్యక్షులు బద్యా నాయక్ కోరారు. గిరిజనుల ఆరాధ దైవం రాంరామ్ మహారాజ్ జన్మదినం రోజున గురుపౌర్ణమి నిర్వహిస్తారని, దేశంలోని ప్రతీ తండాలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తారని తెలిపారు. గిరిజనులు ప్రతి తండాలో భోగ్ బండార్ నిర్వహించాలని సూచించారు.

13న దుర్గామాత బోనాలు

బాన్సువాడ: బాన్సువాడలో ఈ నెల 13న దుర్గామాత బోనాల పండుగ నిర్వహించనున్నట్లు దుర్గామాత ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని పాత బాన్సువాడ చావిడి వద్ద గ్రామ పెద్దలతో, వివిధ కుల సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో నిర్వహించే దుర్గమాత బోనాల పండుగ ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించాలని కమిటీ సభ్యులు సూచించారు. గ్రామ పెద్దలు మాసాని శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, జలపతిరెడ్డి, దాసరి శ్రీనివాస్ ఉన్నారు.

‘భవిష్యత్తు తరాల కోసం ప్రకృతిని కాపాడాలి’



రోటరీ ఇన్‌స్టాలేషన్ డేలో ప్రమాణం చేస్తున్న నూతన ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: ప్రకృతిని భవిష్యత్తు తరాల కోసం కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం.హరిప్రసాద్ అన్నారు. ఆదివారం మధ్యాహ్నం స్థానిక రోటరీ ఆడిటోరియంలో రోటరీ క్లబ్ ఆఫ్ కామారెడ్డి 51వ వ్యవస్థాపక దినోత్సవం, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రోటరీ క్లబ్ ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణం, తల్లి, పిల్లల ఆరోగ్యం, నీరు, పారిశుద్ధ్యం, శాంతి, సంఘర్షణ పరిష్కారం, వ్యాధి నివారణ, చికిత్స, ప్రాథమిక విద్య, అక్షరాస్యత, సమాజం, ఆర్థికాభివృద్ధి కోసం కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అసిస్టెంట్ గవర్నర్ ఎం.జైపాల్‌రెడ్డి, మాజీ గవర్నర్ ఎంవీ హన్మంత్‌రెడ్డి, నూతన అధ్యక్షులు శంకర్, కార్యదర్శి కృష్ణహరి, కోశాధికారి వెంకటరమణ, ప్రతినిధులు రాజనర్సింహరెడ్డి, జగన్నాథం, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

భక్తుల విరాళాలతో సీసీ కెమెరాల ఏర్పాటు



ఆలయంలో కమిటీ సభ్యులు, పోలీసులు

బాన్సువాడ : పట్టణంలోని కోటదుర్గమ్మ ఆలయంలో భక్తుల విరాళాలతో ఆదివారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇటీవల ఆలయంలో చోరీ జరిగిన నేపథ్యంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తుల నుంచి విరాళాలు సేకరించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మహేష్ మాట్లాడుతూ.. ప్రతీ మందిరంచ దర్గా, చర్చిలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరాలు ఉంటే పోలీసులు ఉన్నట్లేనని అన్నారు. ఆలయ కమిటీని ఆయన అభినందించారు. సభ్యులు ఉప్పరి లింగం, పత్తి శ్రీకాంత్, సంగమేశ్వర్, పత్తి శ్రీనివాస్, మోతీలాల్, శివ, విఠల్ తదితరులున్నారు.